కలుపు నివారణతో అధిక దిగుబడులు

- కలుపు రకాన్ని బట్టి మందు పిచికారీ
- తగిన సమయంలో సరైన మోతాదులోనే వాడాలి


కలుపు మందును పిచికారీ చేస్తున్న రైతులు

రాయవరం: వరిలో కలుపు నివారించడం ద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. సాధారణంగా వరినాట్లు వేసిన తర్వాత రైతులు పంట పొలాల్లో కలుపును కూలీలతో తీయించేవారు. ప్రస్తుతం కూలీల కొరతతో పాటు కూలి రేట్లు విపరీతంగా పెరగడంతో రైతులు ఇతర పద్ధతులపై ఆధారపడుతున్నారు. కలుపును నివారించేందుకు వివిధ రకాల హెర్బిసైడ్‌లు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో లభించే రసాయనిక మందులను ఇష్టం వచ్చినట్లుగా వాడితే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. ఏ రకమైన కలుపు మొక్కలకు ఏ మందు ఎంత మోతాదు వాడాలనే విషయమై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల పరిధిలో 1.05లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. 95 శాతం మేర వెదజల్లు విధానంలో వరిసాగు చేస్తున్నారు. వెదజల్లు విధానంలో కలుపు అధికంగా పెరిగే అవకాశముంది. అందుకే వెదజల్లు సాగు చేపట్టిన రైతులు కలుపును నివారణ చర్యలు ముమ్మరంగా చేపడుతున్నారు. కూలీల ద్వారా కలుపును తీయించడానికి ఎకరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఖర్చవుతుంటే, కలుపు నివారణ మందులను వినియోగిస్తే రూ.2 వేలలో కలుపును సమర్థవంతంగా నివారించొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కలుపు మందును సిఫార్సు చేసిన మోతాదులో అనువైన సమయానికి సరైన పద్ధతిలో మాత్రమే పిచికారీ చేయాలి. మందు పిచికారీకి సరైన నాజిల్‌ను ఉపయోగించాలి. కచ్చితమైన సూచన లేకుండా ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వాడకూడదు.

డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే వరిలో

పైరజో సల్ఫ్యూరాన్, ఈథైల్ 10 శాతం పొడి 80 గ్రాముల్ని ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి విత్తిన మూడు నుంచి ఐదు రోజుల్లో చల్లుకోవాలి. ఫలితంగా వెడల్పాటి కలుపు మొక్కలు, తుంగను నివారించవచ్చు. ప్రెటిల్లాక్లోర్ 30 శాతం, పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 0.75 శాతం గుళికలు విత్తిన మూడు నుంచి ఐదు రోజులకు 800 గ్రాములు ఎకరానికి చల్లుకోవాలి. వీటితో వెడల్పాకు, కలుపు, తుంగ, ఏకవార్షిక గడ్డి జాతి కలుపును అరికట్టవచ్చు.

కలుపు 2–4 ఆకుల దశలో

సహాలో ఫాప్ బ్యూటైల్ 10 శాతం ద్రావకం 400 మిల్లీలీటర్ల ద్రావకం 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల ఊద గడ్డిని నివారించవచ్చు. ఫెనాక్సీ ప్రోప్ ఈథైల్ 9.3 ద్రావకం, 250 మి.లీ ఎకరాకు పిచికారీ చేయడం ద్వారా ఊద, ఏకవార్షిక గడ్డిని నివారించొచ్చు. మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10 శాతం, క్లోరి మ్యూరాన్ ఈథైల్ 10 శాతం ఎకరానికి ఎనిమిది గ్రాములు పిచికారీ చేయడం వల్ల వెడల్పాకు కలుపు, తుంగను అరికట్టొచ్చు. పెకాక్సులం 1.02 శాతం, సెహాలోపాస్ బ్యూటైల్ 5.1 శాతం ద్రావకాన్ని ఎకరాకు 800 నుంచి 900 మి.లీ పిచికారి చేయాలి. దీంతో వెడల్పాకు తుంగ, ఏకవార్షిక గడ్డిజాతి కలుపు చనిపోతుంది.

సరైన మందులతో తేలికగా



పొలంలో మొలిచిన కలుపును బట్టి మందును ఎంపిక చేసుకోవాలి. ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా సరైన సమయంలో మాత్రమే వినియోగించాలి. సాధారణంగా కలుపు 2–4 ఆకుల దశలో ఉన్నప్పుడు మందును సరైన మోతాదులో పిచికారీ చేస్తే నశిస్తుంది. కలుపు నివారిస్తేనే పంట మొక్కలు బాగా ఎదిగి ఆశించిన దిగుబడులు సాధించే అవకాశముంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

విద్యార్థులకు మోడల్ పేపర్ల అందజేత


విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేసిన సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో జెడ్పీ హైస్కూల్ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి గురువారం మోడల్ పేపర్లు అందజేశారు. ఇంగ్లిష్, ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్ మోడల్ పేపర్ల మెటీరియల్‌ను 40 మంది విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్‌కుమారి మాట్లాడుతూ విద్యార్థులందరూ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ గ్రేడ్లు సాధించాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తిలక్‌బాబు, రాజారావు, భూలక్ష్మి, డీఎస్ఎల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వెంటూరులో గడప గడపకూ..

రాయవరం: మండలంలోని వెంటూరులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామంలో పర్యటిస్తారన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు అందజేస్తున్న ఆర్డీఓ సింధుసుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: పట్టణంలోని చిలుకూరి సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు 100 మంది వృద్ధులు, పేదలకు గురువారం దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు రామచంద్రపురం ఆర్డీఓ పి.సింధుసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిలుకూరి సేవాసమితి నిర్వాహకులు చిలుకూరి వీరవెంకట సత్యనారాయణ, చిలుకూరి రామకృష్ణలను అభినందించారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద జైనుల ధర్నా


రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న జైన సంఘాలు

రామచంద్రపురం: జార్ఖండ్ రాష్ట్రంలో జైనులకు అత్యంత పవిత్రమైన ప్రార్థనా స్థలం సమ్మేద్ శిఖర్జీని ఆ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రదేశంగా ప్రకటించడంపై రామచంద్రపురం, ద్రాక్షారామ జైన సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జైన సంఘాల పెద్దలు, మహిళలు, యువతీయువకులు, చిన్నారులు ప్లకార్డులతో ఈ ధర్నాలో పాల్గొని సమ్మేద్ శిఖర్జీ పిక్నిక్ స్పాట్ కాదని, పవిత్ర ప్రార్థనా స్థలమంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ కె.వేదవల్లికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వస్తిమాల్ జైన్, సురేష్ జైన్, భరత్‌కుమార్ జైన్, రమేష్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కామన చేతికి జిల్లా కాంగ్రెస్ పగ్గాలు


కామన ప్రభాకరరావు

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పార్టీ సీనియర్ నేత, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నుంచి నియామక ఉత్తర్వులు అందినట్టు కామన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని ఏడిదకు చెందిన కామన గత మూడున్నర దశాబ్దాల కాలంగా పార్టీలో పలు పదవులు నిర్వర్తించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో మండపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.

ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత


వల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ గజలక్ష్మి

కపిలేశ్వరపురం: స్త్రీ, శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కపిలేశ్వరపురం ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. వల్లూరులోని 26వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించి చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రోగ రహిత జీవితాన్ని గడపొచ్చని సూచించారు. ఆమె వెంట మహిళా పోలీస్ ప్రమీల, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

నేడు రామచంద్రపురంలో గడపగడపకూ..

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ క్యాంపు కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొంటారని చెప్పారు.

అర్హతే ప్రామాణికంగా పేదలకు పింఛన్లు


కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు


సమావేశానికి హాజరైన పింఛన్‌దారులు

- పింఛన్ పెంపుతో ఆనందం రెట్టింపు
- మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక కింద సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని పామర్రు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం పెంచిన పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు మంత్రి వేణు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కె.గంగవరం మండలంలో గతంలో 9,753 పింఛన్లు ఉండగా ఇప్పుడు కొత్తగా మరో 338 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. టీడీపీ హయాంలో కొత్తగా పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేసి లంచాలు ఇస్తే సంవత్సరానికోసారి కొంత మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేసేవారన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అర్హతే ప్రామాణికంగా ఎవరి సిఫార్సులతో పని లేకుండా వలంటీర్లే గుర్తించి లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. అవ్వాతాతల ముఖంలో ఆనందం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల సొమ్మును పెంచారన్నారు. పింఛన్ల సొమ్ము పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం రెట్టింపు అయ్యిందని చెప్పారు. ప్రతిఒక్కరూ సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని వరలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, రాజానగరం పార్టీ పరిశీలకులు వట్టికూటి రాజశేఖర్, నాయకులు పప్పుల మసేను వెంకన్న, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా సభ్యులు బత్తుల అప్పారావు, వైస్ ఎంపీపీలు నీతిపూడి మధుబాల, దూడల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకు సంక్షేమ పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పడమర ఖండ్రికలో 'గడప గడపకూ'


పడమర ఖండ్రిక గ్రామస్తులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: పేదల చెంతకు సంక్షేమ పాలన అందిస్తున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని పడమర ఖండ్రికలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించారు. ఓసీ ఏరియాలో మహిళలు ఎమ్మెల్సీ తోటకు బ్రహ్మరథం పట్టారు. తమ బిడ్డలకు గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల మంజూరయ్యాయంటూ మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. పారదర్శకంగా ఇళ్ల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటను గ్రామస్తులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తమకు జగనన్న ట్యాబ్‌లను ఇచ్చారంటూ విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆసుపత్రికి ఇద్దరు వైద్యులను నియమించడం ద్వారా వైద్య సేవలు మెరుగుపడ్డాయంటూ వృద్ధులు ఎమ్మెల్సీ తోట ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి చేస్తున్నారన్నారు. భవిష్యత్ తరాల బాగోగులపై పూర్తి అవగాహనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి విపక్షాలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. ప్రజలు విజ్ఞతతో వ్యవహరిస్తూ ప్రభుత్వానికి వెన్నెంటి నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు కవల శ్రీను, నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, పాలింగి కిశోర్, కోలపల్లి గోపాలకృష్ణ, తాతపూడి రాజేష్ శర్మ, పలివెల మధు, కవల రాజు తదితరులు పాల్గొన్నారు.

జనరంజకంగా జగన్ పాలన


కపిలేశ్వరపురంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేదల కష్టాలను తీర్చేందుకు అనేక పథకాలను అమలుచేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలను అన్ని విధాలా ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సాగిస్తున్నారన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు మాట్లాడుతూ మండలంలో 328 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, వైస్ ఎంపీపీలు గజ్జెరపు భానుప్రసాద్, సాకా శ్రీనివాస్, ఎంపీటీసీలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, రుద్రాక్షుల వీరగౌరీకుమారి, పలివెల మధు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పింఛన్లు


లబ్ధిదారులకు పింఛన్ సాయం అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్ అందజేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక గొల్లపుంత కాలనీలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం సాయంత్రం ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ గతంలో పింఛన్ సాయం పొందాలంటే లబ్ధిదారులు రోజులు తరబడి పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. జగన్ పాలనలో 1వ తేదీ తెల్లవారకుండానే ఇంటి తలుపును తట్టి వలంటీర్లు పింఛన్ సాయం పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని పేదవర్గాల వారు అభివృద్ధి సాధించాలని దుర్గారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శెట్టి కల్యాణి, పార్టీ నాయకులు ముక్కా దాలయ్య, పేరూరి మాధవి, పిల్లి శివ, శీలం విజయలక్ష్మి, పిన్నెడి కృపావతి, ఎగ్గాడి సతీష్, బత్తిన దొరబాబు, గాజుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీతో లబ్ధిదారుల హర్షం


ద్రాక్షారామలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ద్రాక్షారామలో 40 మంది లబ్ధిదారులకు వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ సున్న సత్యవతిల చేతుల మీదుగా గురువారం పింఛన్లను పంపిణీ చేశారు. హసన్‌బాదలో కొత్తగా మంజూరైన ఏడు కొత్త పింఛన్లతో పాటు 252 మంది పాత లబ్ధిదారులకు పెంచిన సొమ్ముతో పింఛన్లను గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఉప సర్పంచ్ భవానీలు అందజేశారు.

371 మందికి నూతన పింఛన్లు

రాయవరం: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా రాయవరం మండలానికి నూతనంగా 371 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో డి.శ్రీనివాస్ గురువారం విలేకరులకు తెలిపారు. వితంతు 130, వృద్ధాప్య 112, డిజేబుల్డ్ 84, చర్మకారులు 28, డప్పు కళాకారులు 11, కల్లుగీత కార్మికులు నలుగురు, చేనేత ఇద్దరికి పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మండలంలో 10,017 మంది పింఛన్‌దారులకు రూ.2,71,05,250 పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్తంగా..

నేడు పింఛన్ల పంపిణీ

కాజులూరు: గొల్లపాలెంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లు, పెరిగిన పింఛన్లను రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఎంపీపీ మాత భారతి అన్నారు. గొల్లపాలెం పాపాయమ్మపేటలోని పాత రైస్‌మిల్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 1 గంట నుంచి సమావేశం జరుగుతుందని చెప్పారు.

నేడు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

రాయవరం: స్థానిక వెలమ కల్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.శ్రీనివాసు గురువారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంపీ చింతా అనూరాధ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఇసుక మేటల తొలగింపునకే ర్యాంపు ఏర్పాటు

కె.గంగవరం: ఇసుక మేటల తొలగింపునకే అధికారులు ర్యాంపు ఏర్పాటుచేశారని ఆల్‌కాస్ట్ బోట్స్ మెన్ వర్కర్స్ అండ్ లేబర్ కాంట్రాక్ట్ కోపరేటివ్ సొసైటీ సభ్యులన్నారు. గురువారం వారు మాట్లాడుతూ గోదావరికి వచ్చిన వరదల కారణంగా కోట గ్రామంలోని లంక పొలాల్లో ఇసుక మేటలు వేసిందన్నారు. దీంతో మేటలు తొలగిస్తే కూరగాయలు పండించుకుంటామని తాము అధికారుల్ని ఆశ్రయిస్తే అక్కడ ఇసుక ర్యాంపు ఏర్పాటుచేశారని చెప్పారు. అయితే గ్రామానికి సంబంధం లేని కొందరు దురుద్దేశంతో ఇసుక ర్యాంపుపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, వారి మాటల్ని అధికారులు పరిగణలోకి తీసుకోవద్దని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ సింధుసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వైద్యనాథశర్మలకు వినతి పత్రాలు అందజేశామని చెప్పారు.

ద్రాక్షారామ-రామచంద్రపురం రోడ్డు నిర్మించాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. గురువారం ద్రాక్షారామలో సమావేశమైన నాయకులు రోడ్డు నిర్మాణం చేపట్టే వరకూ ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. దీని కోసం కమిటీ ఏర్పాటు చేసి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు చింతపల్లి వీరభద్రరావు, చింతపల్లి అర్జున్, పెంకే సాంబశివరావు, నందూరి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ పట్టణ కార్యవర్గం ఎంపిక


యూటీఎఫ్ రామచంద్రపురం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రామచంద్రపురం: యూటీఎఫ్ రామచంద్రపురం పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం శ్రీమతి ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పట్టణ అధ్యక్షుడిగా జి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పీఎస్‌వీ రమణ, గౌరవాధ్యక్షుడుగా ఎస్వీ నాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.వీరేంద్రబాబు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎల్.మల్లేశ్వరి, కోశాధికారిగా డి.ప్రసన్న శంకర్, కార్యదర్శులుగా ఎం.సత్యనారాయణరావు, వి.రామకృష్ణ, పీఎస్ దుర్గాప్రసాద్, జీవీ హనుమాన్, ఎస్.అర్జునరావు, వి.భాగ్యలక్ష్మి, ఎస్.మధురమీనాక్షిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వివాహ ధ్రువపత్రం అందజేత


వివాహ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ ఆరిఫ్

రాయవరం: సోమేశ్వరం గ్రామానికి చెందిన కొవ్వూరి సందీప్‌రెడ్డి, సింధుప్రియలు డిసెంబర్ 8వ తేదీన వివాహం చేసుకున్నారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సందీప్‌రెడ్డికి వివాహ ధ్రువపత్రాన్ని సర్పంచ్ ఆరిఫ్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఆనంద్‌లు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే పార్టీలు బలోపేతం

కాజులూరు: కార్యకర్తల కృషితోనే పార్టీలు బలోపేతమవుతాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యల భాస్కరరావు అన్నారు. మండలంలోని నామవానిపాలెంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలనాటికి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యల భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబరు కాకర్లపూడి రామరాజు, సలాది వీరబాబు, కొప్పన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు


పార్టీలో చేరిన మత్స్యకారులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: అంగర, కపిలేశ్వరపురం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 85 మంది అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గీయులు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వెంకటాయపాలెంలోని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు అరదాని శ్రీదేవి సమక్షంలో పార్టీలో చేరగా త్రిమూర్తులు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మత్స్యకార సహకార సంఘం, అగ్నికుల క్షత్రియుల సంఘాల నాయకులు తెలికోటి త్రినాథ్, కర్రి దుర్గారావు, సంగాని శ్రీనివాస్, రచ్చా సత్యనారాయణ, కర్రి శివశంకర్, తెలికోటి శ్రీనివాస్, లంకె విజయ్ కుమార్ ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని వారు చెప్పారు.

జల్‌జీవన్ మిషన్ పనులపై సమీక్ష

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.10.37 కోట్లతో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనుల ప్రగతిపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష జరిగింది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు జల్‌జీవన్ మిషన్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఇష్టానుసారం గోతులు తవ్వేసి పూడ్చకపోవడాన్ని నిరసించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని జొన్నాడ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అన్నారు. దీనిపై ఎంపీపీ లక్ష్మణరావు, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బి.నరసింహారావు సంబంధిత కాంట్రాక్టర్లను వివరణ అడిగారు. భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులకూ తావు లేకుండా అధికారులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ ఈఓ పీఆర్‌డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఆలమూరు: వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారాన్ని వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీ శంకర్, ఎం.సుమలత ఆధ్వర్యాన సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్ బేబీ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లారు. నిర్ణీత సమయానికి పౌష్టికాహారం అందించాలని, క్రమం తప్పకుండా చిన్నారులకు ఆటపాటలు నేర్పించాలని సూచించారు.